క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ శివంహిల్స్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు. 11కేవీ సరూర్‌నగర్, కమలానగర్, హుడాకాంప్లెక్స్, పుష్పాగార్డెన్స్, డెంటల్ కళాశాల, శారదానగర్, నేతాజీనగర్, నర్సింహాపురికాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు. 11కేవీ హయత్‌నగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పూలే సేవలు మరువలేనివి



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న పద్మశ్రీ, తదితరులు

మీర్‌పేట: మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతిని మీర్‌పేట కార్పొరేషన్ పరిధి బాలాపూర్ చౌరస్తాలో గురువారం కాంగ్రెస్ పార్టీ మీర్‌పేట మహిళా అధ్యక్షురాలు పద్మశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన సేవలను ఆమె గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు సిద్దేశ్వరచారి, సుధాకర్, రేణుక, మహేందర్, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కార్తీకమాస వనభోజనాలు




ప్రగతి చక్ర అవార్డులను ఉద్యోగులకు అందజేసిన ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీసుధ

మహేశ్వరం: మండల కేంద్రంలో ఆర్టీసీ డిపోలో కార్తీకమాసం వన భోజన కార్యక్రమాన్ని గురువారం డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులందరూ వారి జీవిత భాగస్వాములతో పాల్గొని వన భోజనాలు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఆటలు, పాటల పోటీలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్టీసీ కార్మికులకు ప్రగతి చక్ర అవార్డుల బహుమతులను మహేశ్వరం డిపో మేనేజర్ లక్ష్మీసుధ అందజేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ మెకానికల్ చందర్, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ పి.అంజమ్మ, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అవుట్‌లెట్ సమస్యను పరిష్కరిస్తాం

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



అవుట్‌లెట్ సమస్యను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీ 19వ వార్డులో నెలకొన్న అవుట్‌లెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. వార్డులో నెలకొన్న సమస్యను గురువారం ఆయన స్థానిక కౌన్సిలర్ పల్లపు శంకర్‌తో కలిసి పరిశీలించారు. ఎగువ బస్తీల నుంచి వస్తున్న వరదనీరు దిగువన బస్తీ మధ్యలో నిలిచిపోతుండడంతో స్థానికులు ఇబ్బందులు తప్పడం లేదని కమిషనర్‌కు స్థానికులు వివరించారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సమస్యపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి పరిష్కారం చూపుతామన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తిచేసేలా కృషి చేస్తానన్నారు.

జీవాలను రక్షించుకోవాలి

షాబాద్: వ్యాధుల నుంచి మూగజీవాలను రక్షించుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మద్దూరు, రేగడిదోస్వాడ గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నిర్వహణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గ్రామాల్లో పారుడు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

ప్రైవేటుకే మొగ్గు

- ప్రభుత్వ నిబంధనలతో వ్యాపారులకు ధాన్యం విక్రయాలు
- 17 రోజులుగా ఒక్కరూ కూడా ముందుకురాని వైనం
- వెలవెలబోతున్న ధాన్యం కొనుగోలు కేంద్రం



రైతులు లేక వెలవెలబోతున్న చేగూరులో వరిధాన్యం కొనుగోలు కేంద్రం

నందిగామ: రైతులు పండించిన వరి ధాన్యానికి మద్దతు ధరతో ప్రభుత్వమే పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం రైతులు లేక వెలవెలబోతోంది. మండల పరిధిలోని చేగూరులో ఈ నెల 11న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా పీఏసీఎస్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. 2600 మంది సభ్యులున్నా ఈ పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి 17 రోజులు పూర్తయినా కూడా ఏ ఒక్క రైతు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు ముందుకు రాలేదు. దీంతో ఆ కొనుగోలు కేంద్రం రైతులు లేక వెలవెలబోతోంది.

పీఏసీఎస్‌ల ద్వారా..

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)ల ద్వారా ఆ సంఘం పరిధిలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇందుకుగాను క్వింటాల్‌కు ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300గా ధరను నిర్ణయించారు. అంతే కాకుండా సన్నరకాలకు(నాణ్యతా ప్రమాణాలు పాటించిన ధాన్యానికి) అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ సైతం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

నాణ్యత ప్రమాణాలు ఇలా..

- తేమ 17 శాతానికి మించకుండా ఉండాలి
- మట్టి పెళ్లలు, రాళ్లు 1 శాతం మించకుండా ఉండాలి
- చెత్త, తాలు 1 శాతం మించకుండా ఉండాలి
- చెడిపోయిన, రంగుమారిన మొలకెత్తిన పురుగుతిన్న ధాన్యం 5 శాతానికి మించకుండా ఉండాలి
- పూర్తిగా తయారు కాని ముడుచుకుపోయిన ధాన్యం 3 శాతం
- తక్కువ రకముల మిశ్రమం 60శాతానికి మించకుండా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాటు రైతులు తమ ధాన్యాన్ని తామే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించింది.

రైతుల అనాసక్తి ఎందుకంటే..

- బయటి మార్కెట్‌లో పచ్చి వడ్లు (ధాన్యం) రూ.2,100 నుంచి 2,300 వరకు ధర పలుకుతోంది
- చేను మీద నుంచి పచ్చి ధాన్యాన్ని నేరుగా మార్కెట్‌కు తీసుకెళ్లొచ్చు.
- ధాన్యాన్ని ఆరబెట్టేందుకు తప్పుతున్న ఇబ్బందులు
- ఒక వేళ ఎండబెట్టిన ధాన్యం అయితే మార్కెట్లో రూ.2,600 నుంచి 2,700 వరకు ధర పలుకుతోంది.
- పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకెళ్లేందుకు బస్తాలు లేక ఇబ్బందులు పడాల్సి రావడం
- ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రూ.500 వస్తుందో లేదో అనే అనుమానం.
- బయట మార్కెట్‌లో విక్రయించినట్లయితే స్పాట్‌లో నగదు వస్తుందనే ఆలోచన.
- తదితర కారణాలతో పండించిన ధాన్యాన్ని పీఏసీఎస్‌లకు విక్రయించేందుకు ముందుకు రావడం లేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం రైతులు లేక వెలవెలబోతోంది.

గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదు



5 ఎకరాలలో వరి పంట వేశాను. ఇటీవల పంటను కోశాం. విక్రయించేందుకు పీఏసీఎస్‌కు తీసుకెళ్దామంటే గన్నీ బ్యాగులు అక్కడ ఇవ్వడం లేదు. దీంతో ధాన్యాన్ని ఏ విధంగా అక్కడకు తీసుకెళ్లాలి. అదేవిధంగా ధాన్యాన్ని అక్కడకు తీసుకెళ్లిన తర్వాత తూర్పాల పట్టాలంటే ఎలా. ఇక్కడి కన్నా బయట మార్కెట్‌లో విక్రయించడమే మంచిది.

– గోవిందు శ్రావణ్‌కుమార్, రైతు, నర్సప్పగూడ

రైతులు ముందుకురావడం లేదు..



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి 17 రోజులు అయినా కూడా ఏ ఒక్క రైతు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు ముందుకు రావడంలేదు. రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చేందుకు గన్నీ బ్యాగులు అడుగుతున్నారు. గన్నీ బ్యాగులు ఇచ్చేందుకు అవకాశం లేదు. గన్నీ బ్యాగుల విషయమై సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

–గోర్లపల్లి అశోక్, చైర్మన్, చేగూరు పీఏసీఎస్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటేశం

- ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటేశం

మహేశ్వరం: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతని నేదునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరం అన్నారు. గురువారం కందుకూరు మండల పరిధిలోని నేదునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యర్థాల నిర్వహణ పునర్వినియోగం(రీసైక్లింగ్) కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన చుట్టూ ఉన్న పరిసరాలను ఎప్పటికప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాల ఆవరణలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దన్నారు. అంతకుముందు విద్యార్థులు తీసుకొచ్చిన పాత పుస్తకాలు, నోట్‌బుక్స్, ప్లాస్టిక్ కవర్లు, చాక్లెట్ కవర్ల వ్యర్థాలను తూకం చేసి వెలకట్టి విద్యార్థులకు కావాల్సిన పెన్నులు, పెన్సిళ్లు, నోట్‌బుక్స్‌తో పాటు స్టేషనరీ సామగ్రిని అందజేసి ప్రశంస పత్రాలను అందజేశారు. ఎక్కువ మొత్తంలో తీసుకొచ్చిన విద్యార్థులు అర్చన, సుషాంత్‌లకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఐటీసీ ఇన్‌చార్జి రామకృష్ణ, ఎండీ.అజార్, ఉపాధ్యాయులు గ్లోరీ, శాంతాకుమారి, కౌసల్య, శ్రీవాణి, ఎండీ.అబ్దుల్, ఎండీ.బషీర్ సర్వర్, హుసునొద్దిన్, శ్రీశైలం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు కనీస వేతనాలు అందించాలి



కేజీబీవీ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

- యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన

మహేశ్వరం: కేజీబీవీ, సర్వశిక్ష ఉద్యోగులకు కనీస వేతనం, ప్రభుత్వ అలవెన్సులు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కందుకూరు మండల కేంద్రంలోని కేజీబీవీలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా కేజీబీవీ, సర్వశిక్ష ఉద్యోగ ఉపాధ్యాయులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి తక్కువ వేతనంతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందని, వెంటనే ప్రభుత్వం స్పందించి తగు నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ భార్గవి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి రవి, రాములు, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

- మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్



రైతులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న కేఎల్లార్

మహేశ్వరం: ఫోర్త్ సిటీ 300 ఫీట్ల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ పేర్కొన్నారు. గురువారం తుక్కుగూడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కందుకూరు మండల రైతులతో ఆయన సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోర్త్ సిటీ 300 ఫీట్ల రోడ్డు నిర్మాణంతో ఈ ప్రాంత రైతుల భూముల రేట్లు పదిరెట్లు పెరిగి లాభం అవుతుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న అసత్య ప్రచారం రైతులు నమ్మొద్దన్నారు. రోడ్డుకు భూములు కోల్పోయిన రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి సముచిత న్యాయం చేస్తారన్నారు. రైతులు ఎవరూ అధైర్యపడొద్దని ఆయన సూచించారు. ఫోర్త్ సిటీ, గ్రీన్ ఫార్మా, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ హబ్, స్కిల్ యూనివర్సిటీ ద్వారా కొత్త పట్టణంలో అంతర్జాతీయ సదుపాయాలను ఏర్పాటు చేస్తామన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: నిరుపేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలో ఆయా మండలాలకు సంబంధించి 66 మందికి వచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్, 44 మందికి వచ్చిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయా స్థానిక నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు అధైర్యపడకుండా ఆపదలో ఉన్నవారు సీఎం నిధుల కోసం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. 66 మందికి గాను 28లక్షల 61వేల 700ల రూపాయలు చెక్కులు వచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం అందించే పథకాలను పేద ప్రజలకు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, నవాబుపేట చైర్మన్ గీతాసింగ్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు వీరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, పాండు, రాములు, భీమయ్య, నరేందర్, చెన్నయ్య, శ్రీనివాస్‌గౌడ్, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.



క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రైతు పండుగను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సులోచన

- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి కావొస్తున్న సందర్భంగా మహబూబ్‌నగర్‌లో ప్రభుత్వం నిర్వహించే రైతు పండుగను విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కోరారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆమిస్తాపూర్‌లో ఈ నెల 28, 29, 30 తేదీలలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయానికి సంబంధించి పనిముట్లు, ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ పద్ధతులపై స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతీ మండలం నుంచి వంద మంది రైతులను తీసుకెళ్లేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని చించోడ్, వెలిజర్ల, జిల్లేడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల, పెద్ది ఎల్కిచర్ల, కేశంపేట మండలంలోని కేశంపేట ఎంపీడీఓ కార్యాలయం, తొమ్మిదిరేకుల, కొందుర్గు మండలంలోని కొందుర్గు రైతు వేదిక, ముట్పూరు రైతువేదిక, కొత్తూరు మండలంలోని గూడూరు, ఎస్‌బీపల్లి, నందిగామ మండలంలోని నందిగామ రైతువేదిక, మామిడిపల్లి, గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించే కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్లు కరుణాకర్, మల్లేశ్, భాస్కర్, రవి, నాయకులు కృష్ణారెడ్డి, అర్జున్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

షాబాద్: రైతు సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి సుజాత పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆమిస్తాపూర్‌లో ఈ నెల 28, 29, 30 తేదీలలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షాబాద్ మండలం నుంచి అన్ని గ్రామాల రైతులు పెద్దఎత్తున రైతు పండుగకు తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు. ఈ రైతు పండుగలో ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానం పెంపొందించే అనేక ప్రదర్శనలుంటాయని చెప్పారు. ప్రభుత్వం రైతుల కోసం చేపట్టే సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పిస్తుందని సూచించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో దేవతా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో లక్ష్మణ, గణపతి, నాగదేవత, శివ, నందీశ్వర, నవగ్రహ, ధ్వజ, శిఖర దేవతా ప్రతిష్ఠాపన చేశారు. జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామీజి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నేత శ్రీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొని స్వామివార్లకు పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టెక్నాలజీ పెంపునకు సదస్సులు దోహదం

రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.ప్రతాప్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: అంతర్జాతీయ సదస్సులు నిర్వహించడంతో కళాశాలలోని అధ్యాపకులకు నూతన టెక్నాలజీతో పాటు కమ్యూనికేషన్ అభివృద్ధి చెందుతుందని జేఎన్టీయూ హైదరాబాద్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.ప్రతాప్‌రెడ్డి, విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎమ్మెల్యే పళ్ల రాజేశ్వర్‌రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో గల విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్ కమ్యూనికేషన్ ఇన్ఫర్మేషన్ అనే పేరుతో ఈ బ్లాక్ ఆడిటోరియం ఈసీఈ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడురోజుల అంతర్జాతీయ కాన్ఫరెన్స్ సదస్సుకు ముఖ్య అతిథిగా రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.ప్రతాప్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కాన్ఫరెన్స్‌కు సంబంధించిన సావినార్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంతర్జాతీయ సదస్సులో వివిధ కళాశాలల నుంచి దాదాపు 260 మంది అధ్యాపకులు పాల్గొనడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబారెడ్డి, కళాశాల డీన్ పద్మజ, కాన్ఫరెన్స్ చైర్‌పర్సన్ డాక్టర్ తులసిప్రసాద్, అధ్యాపకులు ఉన్నారు.

ఐక్యతతో హక్కులను సాధించుకుందాం

- మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, కాంగ్రెస్ నాయకుడు మధు

శంకర్‌పల్లి: రాష్ట్రంలోని ముదిరాజ్‌లందరూ ఐక్యమత్యంగా ఉన్నప్పుడే రాజకీయ అవకాశాలు మెండుగా వస్తాయని మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, కాంగ్రెస్ నాయకుడు నీలం మధు అన్నారు. గురువారం పట్టణంలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంక్షేమ భవనాన్ని వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అదేవిధంగా భవన ఆవరణలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న, కిచ్చన్నపల్లి రవీందర్ ముదిరాజ్‌ల విగ్రహాలను ఆవిష్కరించారు. అతిథులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముదిరాజ్ అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. కష్ట, సుఖాల్లో ముదిరాజ్‌లందరూ ఐక్యంగా ఉండి పోరాడి, మన హక్కులను సాధించుకుందామని స్పష్టం చేశారు. భవన ప్రారంభోత్సవంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి హాజరుకాగా నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పులుమామిడి రాజు, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు తలారి మైసయ్య, బాబయ్య, భీంభరత్, సంతోష్, నారాయణ, శ్రీకాంత్, నరేశ్, జంగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



పండుగ సాయన్న, రవీందర్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి, నాయకులు

దీక్షా దివస్‌ను జయప్రదం చేయండి

నందిగామ: బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు శంషాబాద్‌లో శుక్రవారం నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్త విధిగా హాజరుకావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నోముల పద్మారెడ్డి కోరారు. మండల కేంద్రమైన నందిగామలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ముందుగా మండల కేంద్రమైన నందిగామలో ఉదయం 8 గంటలకు పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం శంషాబాద్‌కు తరలివెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆదేశాల మేరకు ప్రతీ కార్యకర్త, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆర్టీసీలో కార్తీక వనభోజనాలు

షాద్‌నగర్‌రూరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డీఎం ఉష ఆధ్వర్యంలో గురువారం కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోలో విధులు నిర్వహిస్తున్న కండక్టర్లు, డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బందికి పలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం డీఎం ఉష మాట్లాడుతూ.. టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ఉద్యోగుల్లో సోదరభావాన్ని పెంపొందించడంతో పాటుగా కలిసిమెలిసి ఉత్సాహంగా పనిచేసేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



కార్తీక వన భోజన కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు

రైతులను వేధించడం సరికాదు

- భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్

షాబాద్: దేవాదాయ భూముల నుంచి విద్యుత్ లైన్‌ల తొలగింపు పేరుతో రైతులను వేధించొద్దని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎర్రోనిగూడ గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతారాంపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సీతారామచంద్రస్వామి దేవాదాయ భూములకు ఆనుకొని పట్టా భూముల్లో వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న రైతులను అధికారులు వేధిస్తున్నారని మండిపడ్డారు. పోతుగల్, లక్ష్మరావుగూడ, ఎర్రోనిగూడ, మల్లారెడ్డిగూడ, గోపిగడ్డ, పోలారం తదితర గ్రామాల్లోని రైతులను విద్యుత్ అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. దేవాదాయ భూముల్లో నుంచి విద్యుత్ లైన్లను డీటీఆర్‌లను తొలగిస్తే వెంటనే వాటిని పట్టా భూముల్లో రైతులకు అనుకూలంగా అమర్చి సేద్యం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆయూబ్, మండల భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు యాదవరెడ్డి, వీరేశం, సత్యంగౌడ్, రైతులు తదితరులు ఉన్నారు.



ఎర్రోనిగూడలో రైతులతో మాట్లాడుతున్న గజేందర్‌గౌడ్